


సి.ఎస్.ఆర్.ప్రసాద్

పరీక్షలు దగ్గర కొచ్చాయని సంగీత తోటివారితో ఆడుకోవడానికి వెళ్ళకుండా రూమ్‌లో కూర్చుని చదువుకుంటోంది.

"సంగీతా! ఇప్పుడే కదా స్కూల్ నుంచి వచ్చావు? అప్పుడే చదువు మొదలుపెట్టావా? కాసేపు ఆడుకోవచ్చు కదా?" అన్నది విశాలాక్షి.

"నాకు ఆడుకోవాలనిపించడం లేదు టీచర్. ఎగ్జామ్స్ దగ్గరకొచ్చాయి. చదువుకుంటాను" అని పుస్తకంలో తల దూర్చింది సంగీత.

ఆసరా అనాథాశ్రమంలో వున్న ఆడపిల్లలందరిలో సంగీతంటే విశాలాక్షికి ఎంతో అభిమానం. చిన్నప్పటి నుంచి చక్కగా చదువుకుంటుంది. చెప్పిన మాట వింటుంది. పేచీలు పెట్టదు. బుద్ధిమంతురాలు. ఏ తల్లి కన్నబిడ్డో? ఇంత చక్కటి పిల్లను పెంచి పెద్దజేసే అదృష్టానికి నోచుకోలేదు అనుకుంది.

చీకటిపడుతూ వుండగా ఆయా వచ్చి "సంగీతా! పెద్దమ్మగారు పిలుస్తున్నారు" అన్నది.

సంగీత అయోమయంగా చూసింది.

పెద్దమ్మగారు పిల్లలెవర్నీ పిలవరు. పిలిచిందంటే వాళ్ళు ఏదో తప్పు చేసి వుండాలి. తనేం తప్పు చేసింది? ఎందుకు కబురు పంపింది? సంగీతకు ఎంత ఆలోచించినా సమాధానం దొరక లేదు. ఆశ్రమాన్ని మేనేజ్ చేస్తున్న దయావతినే అంతా పెద్దమ్మగారని పిలుస్తారు.

సంగీత భయపడుతూ ఆఫీసు రూమ్‌లోకి అడుగుపెట్టింది. బైట నుంచి చూడ్డమే తప్ప లోపలకు ఎప్పుడూ వెళ్ళలేదు సంగీత. ఎదురుగా కుర్చీలో కూర్చుని వుంది దయావతి. ఆమెముందు ఎవరో ఒకామె కూర్చుని వుంది. సంగీత తప్పుచేసిన దానిలా తడబడుతూ ఒక పక్కగా నిల్చుంది.

దయావతి తలెత్తి సంగీతను చూసింది. సన్నగా పొడుగ్గా వుంది. కోల ముఖం, చురుకైన కళ్ళు. చూస్తుంటేనే తెలివైన పిల్లని అనిపించింది. పదిహేనేళ్ళుంటాయేమో?

"ఏం చదువుతున్నావ్?" ప్రశ్నించింది దయావతి.

"టెన్త్ మేడమ్!" వినయంతో చెప్పింది సంగీత.

"బాగా చదువుతున్నావా?"

తల వూపింది సంగీత.

దయావతి ఎదురుగా కుర్చీలో కూర్చున్న ఆమె, ప్రసన్న వదనంతో సంగీతనే కళ్ళార్పకుండా చూస్తోంది.

"ఈమె ఎవరో నీకు తెలుసా?" ఆమెను చూపిస్తూ అడిగింది దయావతి.

తల అడ్డంగా వూపింది సంగీత.

"ఎలా తెలుస్తుంది మేడమ్? నేను ఎప్పుడైనా వచ్చి చూస్తుంటే కదా?" అని నవ్వింది ఆమె.

"ఈమె మీ అమ్మ రాజామణిగారు" చెప్పింది దయావతి.

సంగీత కళ్ళు పెద్దవి చేసి రాజామణి వైపు చూసింది. తర్వాత తల దించుకుంది. తల్లిని చూసిన సంగీతలో ఏ భావం కన్పించలేదు. మామూలుగానే వుంది. నేల చూపులు చూస్తూ అసహనంగా కదిలింది. అక్కడ్నుంచి ఎంత తొందరగా వెళ్ళిపోదామా అన్నట్లుంది ఆమె ధోరణి.




"చూడు సంగీతా! నువ్విప్పుడు పెద్దదానివయ్యావు. విషయం తెలుసుకోవాలి. నీ పసివయసులో అనివార్యమైన కారణాలవల్ల నీ తల్లి నిన్నిక్కడ వుంచాల్సి వచ్చింది. ఇప్పుడు నిన్ను మళ్ళీ తన ఇంటికి తీసుకెళ్ళాలనుకుంటోంది. నీకిష్టమైతే చెప్పు. తల్లి వెంట వెళ్ళొచ్చు" అన్నది దయావతి.

సంగీత రోషంతో తలెత్తి చూసి "నాకు ఇష్టం లేదు మేడమ్" అని తలవంచుకుంది.

రాజామణి హతాశురాలైంది. ఆమె ముఖం నల్లగా మాడిపోయింది. సంగీత అంత నిర్మొహమాటంగా ఇష్టం లేదని చెప్తుందని ఆమె వూహించలేదు. ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది.

కుర్చీలోనుంచి లేచి సంగీత దగ్గరికి వచ్చింది. భుజం మీద చెయ్యి వేసి ఆప్యాయతతో నిమిరింది.

"అమ్మా! సంగీతా! నేను నీ కన్నతల్లిని. నా వెంట ఇంటికి రావడం ఎందుకు ఇష్టం లేదు?" అడిగింది రాజామణి.

"ఇప్పుడు నీ అవసరం నాకేమిటమ్మా? నీ ఇంటికి నేనెందుకు రావాలి. ఇక్కడ నాకేం లోటు?" సీరియస్‌గా ప్రశ్నించింది సంగీత.

రాజామణి కూతురు వేసిన ప్రశ్నకు షాక్ తిన్నది. గుండెలోకి శూలం దిగినట్లు విల విల లాడింది. దుఃఖం ముంచుకొచ్చింది.

"నీకు నా అవసరం ఏం లేదమ్మా! నీతోనే నాకు అవసరం వుంది. అప్పుడు లోకానికి భయపడి నిన్ను ఇక్కడ చేర్పించాను. ఇప్పుడు నా భర్త చనిపోయాడు. నిన్ను పసిగుడ్డుగా దూరం చేసిన పాపం ఏమో నాకు తర్వాత పిల్లలు పుట్టలేదు. ఇప్పుడు నాకు నా వాళ్ళంటూ ఎవరూ లేరు. నువ్వు మన ఇంటికి రావాలి. నీకు కన్నతల్లి లేని లోటు తీరుతుంది" ఏడుస్తూనే అన్నది రాజామణి.

"నీకు పిల్లలు పుట్టి వుంటే నేను గుర్తొచ్చేదాన్ని కాదు. నీ భర్త బతికున్నా నేను అవసరం లేదు. ఇప్పుడు ఎవరూ లేకపోబట్టి నేను కావాల్సి వచ్చానన్నమాట" సంగీత మాటలు తుపాకీ గుళ్ళల్లా ఆమె గుండెల్లో గుచ్చుకుంటున్నాయి.

"సంగీతా! ఆమె నీ కన్నతల్లి..!" దయావతి ఏదో చెప్పబోతుంటే అడ్డుపడింది సంగీత.

"మేడమ్! నాకు ఇక్కడ ఎందరో తల్లులున్నారు. నేను పసిగుడ్డుగా వున్నప్పుడు పాలిచ్చి, నీళ్ళుపోసి, ఆడించి పెంచిన తల్లులు. నాకు నడక నేర్పిన తల్లి, అన్నం తినడం నేర్పిన తల్లి, చదువు చెప్పిన తల్లి. వీళ్ళందరికన్నా కన్నతల్లి గొప్పేమిటి? పుట్టినప్పుడు ఇక్కడ పారేసి ఇప్పుడొచ్చి కావాలంటున్న కన్నతల్లి కోసం ఇందరు తల్లుల్ని వదిలి పెట్టి ఎందుకు వెళ్ళాలి?" అని సంగీత చరచరా వెళ్ళిపోయింది.

★